క్లుప్తంగా


84 పట్టణాల్లో ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ



కార్గో సేవలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ వైవీఎన్ కుమార్

కొవ్వూరు: ఆర్టీసీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 84 ముఖ్య పట్టణాల్లో పది కిలోమీటర్ల దూరం వరకూ కార్గో డోర్ డెలివరీ చేస్తున్నామని డిపో మేనేజర్ వైవీఎన్ కుమార్ తెలిపారు. అయితే కార్గో 50 కిలోలకు మించి ఉండరాదన్నారు. కొవ్వూరు డిపో కార్గో డెలివరీ సేవల ప్రచారం మాసోత్సవం సందర్భంగా బుధవారం డిపో వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణీకులనైనా, పార్సిల్స్ అయినా క్షేమంగా చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్గో సేవలందించిన సిబ్బందిని ఆయన అభినందించారు. కండక్టర్ ఎంపీ కుమారి, డ్రైవర్ జేకే కుమార్, అవుట్ సోర్సింగ్ డ్రైవర్ పీఎస్‌కుమార్‌లు కార్గో సేవలు అందించడం మంచి ప్రతిభ కనబరిచారని కొనియాడారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మంత్రిరావు వెంకట సుబ్బారావు (ఫైల్)

పెరవలి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మండలంలోని ఖండవల్లికి చెందిన మంత్రిరావు వెంకట సుబ్బారావు (54) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. పెరవలి ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు వెళ్లిన వెంకట సుబ్బారావు అక్కడ పని ముగించుకుని బుధవారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై స్వగ్రామం ఖండవల్లి వస్తున్నాడు. జాతీయ రహదారిపై ఖండవల్లిలోని రవళి స్పిన్నింగ్ మిల్లు సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం అతడిని ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలైన వెంకట సుబ్బారావును ఆ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు గమనించి 108లో తణుకులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సూర్య భగవాన్ తెలిపారు.

వృద్ధుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గోపాలపురం: మండలంలోని కోమటికుంట గ్రామానికి చెందిన సీహెచ్ దుర్గారావు అనే వృద్ధుడి కుటుంబానికి మానవత స్వచ్ఛంధ సంస్థ మండల శాఖ గురువారం రూ.10 వేల ఆర్థిక సహాయం చేసింది. ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ముప్పన కృపాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు నెల్లి చంద్రశేఖర్, అనుదీప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గుబ్బా లక్ష్మణరావు, పసలపూడి రామారావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలో విజేత మలకపల్లి జట్టు

గోపాలపురం: కొవ్వూరు డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల్లో తాళ్లపూడి మండలంలోని మలకపల్లి జట్టు విజేతగా నిలిచింది. గోపాలపురం మండలం పెద్దాపురం గ్రామంలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారక వాలీబాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో పెద్దాపురం జట్టు, తృతీయ స్థానంలో కొవ్వూరు మండలంలోని ధర్మవరం జట్టు నిలిచాయి. ప్రథమ బహుమతిగా రూ .12 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.8 వేలను నిర్వాహకులు అందజేశారు. పోటీల నిర్వహణకు తానింకి బాబీ, కొర్లపాటి అన్నవరం, తానింకి రామారావు, కొర్లపాటి వీరకృష్ణ ఆర్థిక సహాయం చేశారు. దాసి రాజీవ్ త్రివేది, పెనుగొండ హనుమంతరావు, మట్టా భీమయ్య అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలతో పేదలకు మేలు

- గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు
- ఐదు చోట్ల వైద్య శిబిరాలు


దేవరపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని రామన్నపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద గురువారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల వార్డులను, మందుల పంపిణీ కౌంటర్‌ను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను వైద్యాధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన వివిధ వంటకాల స్టాల్స్‌నే పరిశీలించారు. రోగులకు ఉచితంగా మందుల కిట్లు అందజేశారు. శిబిరంలో 403 మందికి వైద్య పరీక్షలు చేసి, ముగ్గురిని ఉన్నత వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసినట్టు దేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సాంబశివరావు తెలిపారు. డాక్టర్లు ఎస్. నాగేదేవి, హేమ, ఉమాశంకర్ శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కూచిపూడి బుల్లారావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, ఐసీడీఎస్ పీఓ వై.సుందరి, మాజీ సర్పంచ్ కూచిపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుభద్రపాలెంలో 506 మందికి ..

నల్లజర్ల: పోతవరం పీహెచ్‌సీ పరిధిలోని సుభద్రపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ చవ్వాకుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు బిరుదుగడ్డ ప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో సుప్రియ (ఎండీ జనరల్), శాంతికమల (ఆప్తమాలజిస్ట్), పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరరావు, రాజశేఖర్‌లు 506 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. వారిలో 10 మందిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కైలా రాజు, సచివాలయ కన్వీనర్ బిరుదుగడ్డ యోహాను, తానింకి వెంకటేశ్వరరావు, కై లా నాగభూషణం పాల్గొన్నారు.



దేవరపల్లి మండలం రామన్నపాలెంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



వేలివెన్నులో ఈసీజీ పరీక్షను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య



తిరుగుడుమెట్టలో రోగులకు మందులు అందిస్తున్న తాళ్లపూడి ఎంపీపీ పోశిరాజు



నల్లజర్ల మండలం సుభద్రపాలెం వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుప్రియ

తిరుగుడుమెట్టలో 350 మందికి..

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మైఖేల్ ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్యులు 350 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు రోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. శిబిరంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ వల్లభశెట్టి గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, నాయకులు వల్లభశెట్టి చిన్ని, నరాలశెట్టి వెంకటేశ్వరరావు, సచివాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేలివెన్నులో 401 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను గ్రామంలో వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఎస్‌జే ఇర్ఫాన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కానూరు పీహెచ్‌సీకి చెందిన హేమ రాజు (జనరల్ మెడిషన్), శ్రుతి (ఆప్తమాలజీ), శ్రీనివాసు (డెర్మిటాలజిస్టు)లు ఈ శిబిరంలో 401 మందికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఆర్‌కే రాజు, సొసైటీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ బ్రహ్మానందం, నాయకులు చిట్టూరి సుబ్బారాయుడు, ముళ్ళపూడి కృష్ణారావు, పి.పార్వతి, మద్దుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఊనగట్లలో 821 మందికి..

చాగల్లు: ఊనగట్లలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో 821 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారిని ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపీచంద్, వైద్యులు నిషిత, దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

3న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

నల్లజర్ల: పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించేందుకు నవంబర్ 3న రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్-2023) నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా నల్లజర్ల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తారన్నారు. పాఠ్యాంశాల్లో మార్పులు, సిలబస్ రూపకల్పనపై సమగ్ర నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఎంఈఓ చెప్పారు. మూడో తరగతి విద్యార్థులకు వారి పాఠ్యాంశాలపై ప్రశ్నలతో కూడిన పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఆరో తరగతి విద్యార్థులకు నిర్వహించే పరీక్షలో వారి సిలబస్‌లోని లాంగ్వేజ్, గణితం, పరిసరాల విజ్ఞానం నుంచి ప్రశ్నలు ఉంటాయన్నారు. ఇక తొమ్మిదో తరగతి విద్యార్థులకు మాత్రం 8వ తరగతి సిలబస్‌తో లాంగ్వేజ్, గణితం,సైన్సు, సాంఘిక శాస్త్రాల్లోని ప్రశ్నలు ఉంటాయన్నారు. 3,6 తరగతుల విద్యార్థులకు 40 ప్రశ్నలతో కూడిన పరీక్ష రాసేందుకు గంట సమయం ఇస్తారన్నారు. 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలతో కూడిన పరీక్షకు గంటన్నర సమయాన్ని ఇస్తారన్నారు. ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా దూబచర్ల డైట్ కళాశాల విద్యార్థులు వ్యవహరిస్తారన్నారు.

• ముఖ్యమంత్రి ఆత్మీయ స్వాగతం





వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్ గురువారం దివాన్ చెరువు సమీపంలోని డీబీవీ రాజు లేఅవుట్‌లో అంగరంగ వైభంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- కానూరులో గడప గడపకూ..

పెరవలి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని కానూరు గ్రామంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.రెండు వేల కోట్ల వ్యయంతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలోకి..

కానూరు గ్రామానికి చెందిన జనసేన, తెలుగుదేశం పార్టీల నాయకులు నరమామిడి శ్రీను, పేట శ్రీను, బరినకాల భీమా శంకర్, వెలుదుర్తి మణికంఠ తదితరులు ఆ రెండు పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పార్టీ సంక్షేమ పార్టీ, పేదల పార్టీ, రైతు పార్టీ అన్నారు. ఇందులో పనిచేయటానికి అందరికీ అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము ఈ పార్టీలో చేరామన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొమ్మిశెట్టి రాము, సర్పంచ్ భావన పూర్ణచందు మధు, గ్రామ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కరుటూరి గోపి, ఆ పార్టీ నాయకులు అంబటి బ్రహ్మయ్య, తోట సురేష్, కొమ్మిశెట్టి చిన్ని, పాపాడి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కానూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ కానూరు నాయకులతో శ్రీనివాస్‌నాయుడు

ముఖ్యమంత్రి దృష్టికి ఆర్అండ్‌బీ రోడ్ల సమస్య

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని ఆర్ అండ్ బీ రోడ్ల సమస్యను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దివాన్ చెరువులో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి జగన్‌కు ఎమ్మెల్యే తలారి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గోపాలపురం మండలంలోని దొండపూడి ఆర్ అండ్ బీ రోడ్డు 12 కిలోమీటర్ల మేర, దూబచర్ల-ద్వారకాతిరుమల ఆర్ అండ్ బీ రోడ్డు 12 కిలోమీటర్ల పొడవునా పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. ద్వారకాతిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నందున రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరినట్టు ఎమ్మెల్యే వెంకట్రావు తెలిపారు. నిధుల మంజూరుకు సీఎం అంగీకరించారని ఆయన తెలిపారు.



రోడ్ల సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


భారీ అన్నసమారాధన

చాగల్లు: దసరా ఉత్సవాల ముగిశాయి. దాంతో పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాల ఊరేగింపులు, అన్నసమారాధనలు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ ఆలయంలో గురువారం రాత్రి భారీ అన్నసమారాధన జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. చాగల్లులో స్థానిక పాటెమ్మ పేటలో శ్రీ బాల కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

సేంద్రియ సాగు.. దిగుబడి బాగు

- సింగరాజుపాలెంలో 35 బస్తాల దిగుబడి
- పంట కోత ప్రయోగం ద్వారా నిర్ధారణ

నల్లజర్ల: సేంద్రియ పద్ధతిలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మండలంలోని సింగరాజుపాలెంలో మారెం వీర్రాజు అనే రైతు ఎకరం విస్తీర్ణంలో కావేరీ సోనా రకం వరి సాగు చేశారు. గురువారం ఆ పంటను కోసి ప్రయోగం ద్వారా తూకం వేయగా 35 బస్తాల దిగుబడి వచ్చినట్టు ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ విధానంలో పంటకు తక్కువ ఖర్చువుతుందని, నాణ్యమైన పంట దిగుబడి వస్తుందన్నారు. భూమిలో కర్బన శాతం పెంచుకోవచ్చునన్నారు. మొక్కలకు కావాల్సిన 18 రకాల పోషకాలు అందుతాయని చెప్పారు. గాలిలో ఉన్న కార్బన్ డైయాక్సైడ్ భూమిలోకి తీసుకొని మొక్కలకు కార్బన్ డై ఆక్సైడ్ అందిస్తుందన్నారు. వరి పంట కోత ప్రయోగంలో సిబ్బంది శ్రీనివాస్, కనకదుర్గ,కోటేశ్వరి, నరసింహారావు పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగం చేస్తున్నసిబ్బంది

పార్టీ పెద్దేవం నాయకులకు సన్మానం

తాళ్లపూడి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాళ్లపూడి మండల, పెద్దేవం గ్రామ నూతన కమిటీలకు ఎంపికైన ఆ గ్రామ నాయకులను గురువారం సన్మానించారు. పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఆ పార్టీ నాయకుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు బట్టు సుబ్బారావు, పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు చామకూరి సత్యనారాయణలను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తోట రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి, వనితమ్మ గెలుపునకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ కొవ్వూరు మండల శాఖ కన్వీనర్ సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, కంకిపాటి రవి, బెజవాడ వీర్రాజు, నల్లాకుల వేణు, గెద్దం గాంధీ, నామన వీర వెంకటరావు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కమిటీలకు ఎంపికైన నాయకులను సత్కారం

సమన్వయంతో మండలాభివృద్ధికి పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

చాగల్లు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి పని చేయాలని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ఆత్కూరి గోపీచంద్, ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో కౌలు రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరారు. చిక్కాలపాలెం ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఎంపీడీవో బి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ దిగువస్థాయి అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఏవో కె.వేణుగోపాల్, పలు శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చాగల్లులో హోం మంత్రి వనిత పర్యటన

కొవ్వూరు: హోం మంత్రి తానేటి వనిత చాగల్లు మండలం మీనానగరంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు చాగల్లులోని కాపు కల్యాణ మండపంలో ఆ మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు మీనానగరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

నేడు పట్టణంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

నిడదవోలు: పట్టణంలో పలు వార్డుల్లో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి గురువారం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కూడా పాల్గొనే ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కమిషనర్ కోరారు.

విజ్జేశ్వరంలో అండర్ స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్

- సముద్రంలోకి 11,401 వేల క్యూసెక్కుల జలాల విడుదల
- బ్యారేజ్ ఎగువన ఉండే బురద, వ్యర్థాలు దిగువకు
- ఆపరేషన్‌తో శివారు భూములకు సమృద్ధిగా నీరు

నిడదవోలు: జలవనరుల శాఖ, ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు గురువారం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు అండర్ స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ నిర్వహించారు. ఆయకట్టుకు సమృద్ధిగా సాగు, ప్రజలకు సాగునీటిని అందించేందుకు వీలుగా విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్‌కు అనుబంధంగా ఎడమ వైపున ఉన్న స్కవర్ స్లూయిజ్ పైన వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గోదావరి మాతకు పూజలు చేశారు. అనంతరం స్కవర్ స్లూయిజ్ పైన ఆపరేటింగ్ సిస్టంకు హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు స్విచాన్ చేసి నాలుగు తలుపులను మూడు మీటర్లు మేర పైకి ఎత్తి 500 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. నీటి విడుదలను దశల వారీగా పెంచుకుంటూ మధ్యాహ్నం మూడు గంటల వరకూ 11,401 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెట్టారు. డీఈఈ యు. రమేష్, ఏఈఈ కందికట్ల నాగలక్ష్మి, ఏఈ అద్దంకి సాయిరామ్, లాక్ సూపరింటెండెంట్లు విక్రమ్, రాజేష్, బ్రహ్మాజీ, ఫిట్టర్ శ్రీనివాసరాజు, లస్కర్లు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



స్విచాన్ చేసి వరద నీటికి వదులుతున్న జలవనరుల శాఖ హెడ్‌వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు

భారీగా పేరుకుపోయిన బురద

ఏటా వరదల సమయంలో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురిసే భారీ వర్షాలకు ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ధవళేశ్వరం, విజ్జేశ్వరం కాటన్ బ్యారేజీల వద్ద గోదావరి ఉప్పొంగుతుంది. జూన్ నెల నుంచి అక్టోబర్ చివరి వరకూ ఏటా వరదల సమయంలో గోదావరిలో నీరు అధికంగా ఉంటుంది. స్కవర్ స్లూయిజ్ తులుపులు నిత్యం మూసివేసి ఉండడంతో ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకు వచ్చిన బురద, జంతు కళేబరాలు, వ్యర్థాలు, కలప స్లూయిజ్ తలుపుల వద్ద ఆగిపోతాయి. స్కవర్ ఆపరేషన్ పేరుతో బ్యారేజ్‌కు ఎగువన ఉన్న వరద నీటిని ఒక్కసారిగా సముద్రంలోకి విడుదల చేయడం వల్ల బురద, వ్యర్థాలు కూడా సముద్రంలోకి కొట్టుకుపోతాయి. దీంతో ఇక్కడి నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ద్వారా నాలుగు సబ్ డివిజన్ల పరిధిలోని 40 ఉప కాలువల ద్వారా నీటి పారుదలకు అవకాశం ఉంటుంది.